క్లుప్తంగా

ప్రొటోకాల్ పాటించాలి



మాట్లాడుతున్న గిరిప్రసాద్

గూడెంకొత్తవీధి: రాజ్‌మా విత్తనాల పంపిణీలో వ్యవసాయ అధికారులు ప్రొటోకాల్ పాటించాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కంకిపాటి గిరిప్రసాద్ డిమాండ్ చేశారు. ఆయన పార్టీ నాయకులతో కలిసి సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి నాయకుల సమక్షంలో విత్తనాలు పంపిణీ చేయాలని చెప్పడం సరికాదన్నారు. విత్తనాల పంపిణీ సమయంలో వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు అయిన సర్పంచ్‌లు, ఎంపీపీ, ఎంపీటీసీ, జెడ్పీటీసీ తదితరులను కూడా ఆహ్వానించాలని ఈ విషయాన్ని అధికారులు గుర్తు చేసుకోవాలన్నారు. మండల ప్రధాన కార్యదర్శి చంటిబాబు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవోగా ఇమ్మానుయేల్ బాధ్యతల స్వీకరణ



ఇమ్మానుయేల్‌ను అభినందిస్తున్న ఎంపీపీ బోయిన కుమారి, నేతలు తదితరులు

గూడెంకొత్తవీధి: ఎంపీడీవోగా ఇమ్మానుయేల్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇంతవరకు ఇక్కడ ఎంపీడీవోగా పనిచేసిన ఉమామహేశ్వరరావు పదవీ విరమణ చేశారు. దీంతో ఇక్కడ ఏవోగా పనిచేస్తున్న ఇమ్మానుయేల్‌కు జిల్లా పరిషత్ అధికారులు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా ఎంపీపీ బోయిన కుమారి, గూడెం కొత్తవీధి, దామణాపల్లి సర్పంచ్‌లు సుభద్ర, కె.రామకృష్ణ, కో–ఆప్షన్ సభ్యులు ఎస్‌కె దావీద్, వైఎస్సార్‌సీపీ మండల మాజీ అధ్యక్షుడు బొబ్బిలి లక్ష్మణ్, ఉప సర్పంచ్ రాంబాబు, నాయకుడు అంజి తదితరులు పాల్గొన్నారు.

కొత్తిమీర పంటకు వర్షం దెబ్బ



కొత్తిమీరను సేకరిస్తున్న గిరిజన మహిళలు

దుంబ్రిగుడ: మండలంలో విస్తారంగా కురుస్తున్న వర్షాలకు కొత్తిమీర పంట నష్టం జరుగుతుందని. పంట కుళ్లిపోతుండడంతో గిరిజన రైతులు వాటిని సేకరించే పనుల్లో నిమగ్నమయ్యారు. చలికాలంలో మంచుతోనే పండే ఈ పంటకు వర్షాలు భారీగా కురుస్తుండడంతో నష్టం కలుగుతంది. దీంతో పంట పూర్తిగా కుళ్లిపోకుండా సేకరించి వారపు సంతకు, సమీప మార్కెట్‌లకు రైతులు తరలిస్తున్నారు.

వేర్లమామిడిలో పశువైద్య శిబిరం



పశువులకు సంబంధించిన మందులను రైతులకు అందజేస్తున్న సిబ్బంది

జి.మాడుగుల: పశు వ్యాధుల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని, పశువుల్లో వ్యాధి లక్షణాలు కనిపిస్తే పశువుల ఆస్పత్రిని సంప్రదించి మందులు పొందాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ కుసుమ ప్రియదర్శిని సూచించారు. మండల పశువైద్యాధికారి(బంధవీధి)ఆధ్వర్యంలో సోమవారం మండలంలో వంజరి పంచాయతీ వేర్లమామిడి గ్రామంలో ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వర్షాకాల సీజన్ గొంతువాపు జబ్బవాపు వంటి వ్యాధులకు 120 పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. మేకలు గొర్రెలకు డీవార్మింగ్ మందులు పట్టించారు. ఎల్ఎస్ఏ రమణ, ఏహెచ్ఏ హరిబాబు, ఓఎస్‌లు మత్స్యలింగం, అప్పలనాయుడు, వంజరి పంచాయతీ వీఆర్వో ఎల్.చిరంజీవి పాల్గొన్నారు.

భారీ అన్నసమారాధన



లడ్డూ దక్కించుకొన్న భక్తులతో ఎస్ఐ నరసింహమూర్తి తదితరులు

రాజవొమ్మంగి: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట ఏర్పాటు చేసిన గణేశ్ మండపం వద్ద సోమవారం భారీ అన్నదాన కార్యక్రమం జరిగింది. ఇందులో భాగంగా లడ్డూ వేలం పాట, అన్నదాన కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఎస్ఐ నరసింహమూర్తి, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

డ్యాన్స్ పోటీలు రేపు

ముంచంగిపుట్టు: చవితి ఉత్సవాలను పురస్కరించుకొని ఈ నెల 3వ తేదీ రాత్రి 9 గంటలకు డాన్స్ పోటీలు నిర్వహిస్తున్నట్టు అల్లూరి యూత్ సభ్యులు ఉదయ్, గణపతి, మురళీ, కిరణ్, ఆచారి, సురేష్, శ్రీను, రవి తదితరులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూనియర్స్, సీనియర్స్, గ్రూప్స్ లు, సోలో డాన్స్ పోటీలు నిర్వహించి ,బహుమతులు అందించనున్నట్టు తెలిపారు.మరిన్ని వివరాలకు 6303218492, 9493639639 నంబర్లకు సంప్రదించాలని కోరారు.

నిర్లక్ష్యానికి నిదర్శనం


- పశువుల శాలలో పాఠశాల
- చినుకుపడితే గదులన్నీ జలమయం
- మరుగుదొడ్లు లేక బాలికలకు అవస్థలు
- భవనాలకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిధులు మంజూరు
- అసంపూర్తిగా నిర్మాణాలు
- పట్టించుకోని అధికారులు



డి.అగ్రహారంలో పశువులశాలలో పాఠశాల



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నాడు-నేడు లో నిర్మించిన పాఠశాల భవనం



కుమ్మరపల్లి పాఠశాలలో శ్లాబ్‌లో పెచ్చులు రాలి కనిపిస్తున్న ఊచలు

సీలేరు: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేసింది. నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాఠశాల అభివృద్ధి కోసం నాడు–నేడు ద్వారా కోట్లాది రూపాయలు వెచ్చించారు. దీంతో మన్యంలో దశాబ్దాలుగా కనీస మరమ్మతుకు నోచుకోని పాఠశాలల రూపురేఖలు మారిపోయాయి. కొత్త భవనాల్లో మెరుగైన సౌకర్యాలతో కార్పొరేట్‌కు దీటుగా సర్కారు బడులు విద్యార్థులకు అందుబాటులోకి వచ్చాయి. కొన్ని ప్రాంతాల్లో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో పాఠశాలలు భవనాలు ప్రారంభమైనా ఎన్నికల కోడ్ అమలువల్ల పనులు నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత విద్యా వ్యవస్థను విస్మరించింది. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఏడాది పైబడినా ఏజెన్సీలో ఒక్క పాఠశాల భవనానికి మరమ్మతు చేయలేదు. అసంపూర్తిగా ఉన్న పాఠశాల భవన నిర్మాణాలపై కనీసం కన్నెత్తి చూడడం లేదు.

ఉపాధ్యాయులు లేక..చదువులు సాగక

కూటమి ప్రభుత్వం గిరిజన విద్యార్థుల చదువులను గాలికి వదిలేసింది. వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు పునఃప్రారంభించి మూడు నెలలు గడిచినా ఉపాధ్యాయులు లేక చదువులకు విద్యార్థులు దూరమయ్యారు. అలాగే పాఠశాలకు కనీస వసతులు లేక మరింత ఇబ్బందులు పడుతున్నారు. దుప్పులవాడ పంచాయతీ డి.అగ్రహారం పాఠశాల పశువుల పాకల మారింది. ఎన్నో ఏళ్ల కిందట ఈ భవనం నిర్మించడంతో పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. పైకప్పు రేకులు పగిలిపోయి గోడలు కూలిపోయే పరిస్థితిల్లో ఉన్నాయి. శిథిల భవనంలోనే విద్యార్థులు చదువుకుంటున్నారు. ఎప్పుడు కూలుతుందోనని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని డి అగ్రహారం, కోనపల్లి గ్రామానికి చెందిన 44 మంది విద్యార్థులు పాఠశాలలో అభ్యసిస్తున్నారు. సరైన పాఠశాల భవనం లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రూ.25లక్షల నిధులు మంజూరు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఈ పాఠశాల భవనానికి నాడు–నేడు పథకం ద్వారా రూ.25లక్షల నిధులను మంజూరు చేసింది. పనులు ప్రారంభమయ్యాయి. మరుగుదొడ్ల నిర్మాణం జరిగింది. అనంతరం ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో పనులు నిలిచిపోయాయి. అనంతరం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పైబడినా నేటి వరకు ఈ భవనం పనులపై కనీసం దృష్టి సారించలేదు. దీంతో పాఠశాలలో సమస్యలతో విద్యార్థులు సతమతమవుతున్నారని, మరుగుదొడ్లు లేక విద్యార్థినులు పడుతున్న ఇక్కట్లు వర్ణనాతీతమని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం , ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

పెచ్చులూడుతున్న శ్లాబ్

గూడెంకొత్తవీధి: మండలంలోని శంకాడ పంచాయతీ కుమ్మరపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల పూర్తిగా శిథిలావస్థకు చేరింది. శ్లాబ్ బీటలు వారింది. చిన్నపాటి వర్షం కురిసినా కారిపోతుంది. దీంతో తరగతులను సమీపంలోని కమ్యూనిటీ హాలులో నిర్వహిస్తున్నారు. కొత్త భవనం మంజూరు చేయాలని అధికారులకు పలుమార్లు వినతులిచ్చిన పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తరచూ శ్లాబ్ పెచ్చులూడిపడుతుండడంతో విద్యార్థులు భయపడుతున్నారని స్థానికులు చెబుతున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం, విద్యా శాఖ ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు. ఈ విషయంపై హెచ్‌ఎం కె.జ్యోతి మాట్లాడుతూ పాఠశాల భవనం దుస్థితిని ఉన్నతాధికారులకు తెలియజేశామన్నారు.

చినుకుపడితే సెలవు

హుకుంపేట: మండలంలోని శోభకోట పంచాయతీ ఈదులగొంది, తీగలవలస పంచాయతీ సరళం గ్రామాలతో పాటు మండలంలోని తోటకూర పాడు, దారబందలు, కుమ్మరిపుట్టు ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాల భవనాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలన గుర్తించి స్థానికులు శ్రమదానంతో మట్టిగోడలతో షెడ్డును నిర్మించుకున్నారు. ఈ షెడ్డులోనే తరగతులు జరుగుతున్నాయి. వర్షాకాలంలో మరింత ఇబ్బందులు పడుతున్నారు. వర్షం పడితే షెడ్డులో నీరు చేరడంతో తరగతులు జరగడం లేదు. పాఠశాల భవనం కోసం పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని ఈదులగొందిలో పదేళ్ల కిందట సుమారు రూ.12లక్షలతో భవనం మంజురైనప్పటికి ప్రారంభ దశలోనే నిర్మాణం నిలిచిపోయింది. పాఠశాల భవనం నిర్మాణం పూర్తికాకపోవడంతో స్థానిక ఓ ఉపాధ్యాయుడి దాతృత్వంతో సుమారు రూ.1లక్ష ఆర్థిక సాయంతో గ్రామస్తులంతా కలిసి శ్రమదానంతో చిన్న రేకుల భవనం నిర్మించుకున్నారు. విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉండడంతో వసతి సమస్య వెంటాడుతుంది. దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం ఈ షెడ్డులోని తరగతులు జరుగుతున్నాయి. ఇప్పటికైన కూటమి ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



సరళంలో గ్రామస్తులు శ్రమదానంతో నిర్మించుకున్న పాఠశాల షెడ్డు



అసంపూర్తిగా ఉన్న ఈదులగొంది పాఠశాల



ఈదులగొందిలో ఉపాధ్యాయుడి ఆర్థిక సాయంతో నిర్మించిన పాఠశాల

వైఎస్సార్‌సీపీ మరింత బలోపేతానికి కృషి



వంజరిలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి సీతారాంనాయుడు

జి.మాడుగుల: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు అందరు కలసికట్టుగా పనిచేయాలని మాజీ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి వంజరి సీతారాంనాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు గిరిజన ఐక్యవేదిక జిల్లా సహాయ కార్యదర్శి కొండపల్లి మత్స్యరాజు పిలుపునిచ్చారు. మండలంలో వంజరి పంచాయతీలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల, గ్రామస్తులతో సోమవారం సమావేశం జరిగింది. వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సాగిస్తున్న ప్రజా వ్యతిరేక పాలనపై చేపడుతున్న బాబూ ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమాలపై గ్రామాల్లో విస్తృత ప్రచారం చేయాలన్నారు. వైఎస్సార్‌సీపీ మరింత బలోపేతానికి కృషి చేయాలని కోరారు. వైఎస్సార్‌సీపీ విధి విధానాలు గురించి, నాయకులు, కార్యకర్తలు ప్రవర్తనా నియమావళిపై వారు చర్చించారు. నాయకులు శివన్నారాయణ, గిరిజన ఐక్యవేదిక మండల అధ్యక్షుడు వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేత మృతికి సంతాపం



గోపన్న (ఫైల్)

దుంబ్రిగుడ: మండలంలోని పోతంగి పంచాయతీ బల్లుగుడ గ్రామంలో మాజీ వైస్ ఎంపీపీ, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు శెట్టి గోపన్న (72) సోమవారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందారు. మండల అభివృద్ధితో పాటు పంచాయతీ పెద్దగా, బల్లుగుడ గ్రామ అభివృద్ధికి ఎంతో కీలకంగా పనిచేశారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటని మాజీ జెడ్పీటీసీ మండ్యాగురు శ్రీరాములు, వైస్ సర్పంచ్ జగ్గునాయుడు తదితరులు చెప్పారు. శెట్టి గోపన్న మృతికి పలువురు నాయకులు సంతాపం తెలిపారు.

నెల్లిపాక చేరిన 108

సాక్షి ఎఫెక్ట్..



108 సేవలను ప్రారంభిస్తున్న అధికారులు,సిబ్బంది

ఎటపాక: మరమ్మతుకు గురికావడంతో గత మూడు నెలలుగా మండలంలో 108 సేవలు నిలిచిపోవడంతో రోగులు, ప్రమాద క్షతగాత్రులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయితే సమస్యను ఆపదలో ఆపద్బాంధవి అనే కథనంతో 'సాక్షి' ఆదివారం వెలుగులోకి తెచ్చింది. దీంతో జిల్లా ఉన్నతాధికారులు స్పందించారు. ఎటపాక మండలానికి 108 వాహనాన్ని కేటాయించడంతో సోమవారం నెల్లిపాక పీహెచ్‌సీకి వాహనం చేరుకుంది.ఈ వాహనాన్ని మండలంలో సేవలు అందించేందుకు అనకాపల్లి మండలం నుంచి ఇక్కడికి పంపారు.ఏజెన్సీ డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ పుల్లయ్య వాహన సేవలను పునరుద్ధరించారు. దీంతో మండల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. 108 సూపర్‌వైజర్ శామ్యూల్, డాక్టర్ దుర్గాప్రసాద్, సిబ్బంది లక్ష్మణ్, రవి ,చందు, మహేష్, కృష్ణార్జున్, శ్రీనివాస్ తదితరులున్నారు.

వైఎస్సార్ సేవలను స్మరించుకుందాం



అరకులోయ జెడ్పీటీసీ రోషిణి

అరకులోయటౌన్: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి వర్ధంతికి అందరూ తరలిరావాలని అరకులోయ జెడ్పీటీసీ సభ్యురాలు శెట్టి రోషిణి పిలుపునిచ్చారు. ఆమె సోమవారం విలేకరులతో మాట్లాడుతూ మహానేత వైఎస్సార్ సేవలను స్మరించుకుందామన్నారు. వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు స్వాభి రామ్మూర్తి అధ్యక్షతన ఉదయం 10గంటలకు మండల కేంద్రంలోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమానికి అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం హాజరుకానున్నట్టు తెలిపారు. అరకులోయ, డుంబ్రిగుడ మండలాల జెడ్పీటీసీ, ఎంపీపీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రధాన కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు, బూత్ కమిటీ ఇన్‌చార్జీలు అభిమానులు అందరూ తరలిరావాలని జెడ్పీటీసీ రోషిణి పిలుపునిచ్చారు.

దుంబ్రిగుడ: మండలంలో మంగళవారం జరిగే దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి వర్ధంతి కార్యక్రమాన్ని తరలిరావాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పాంగి పరశురామ్, పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.



ముంచంగిపుట్టులో వైఎస్సార్ విగ్రహం వద్ద ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ముంచంగిపుట్టు: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతిని నిర్వహించేందుకు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పాంగి పద్మారావు ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. నాలుగు రోడ్ల కూడలిలో ఉన్న వైఎస్సార్ విగ్రహానికి వైఎస్సార్‌సీపీ నేతలు రంగులు వేస్తూ, పరిసరాలు శుభ్రం చేశారు.

ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు పద్మారావు మాట్లాడుతూ వైఎస్సార్ వర్ధంతికి సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యకర్తలు, అభిమానులు హాజరుకావాలని వారు కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల ప్రధాన కార్యదర్శులు రాంప్రసాద్, సన్యాసిరావు, కార్యదర్శి పాపారావు, నాయకులు జె.వి.వి.ఎస్.మూర్తి, తిరుపతి, సింహాచలం, రామ్మూర్తి, ప్రసాద్, రాజారావు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలకు భవనాల మంజూరు

కొయ్యూరు: పీఎం జన్‌మన్ పథకంలో భాగంగా మండలంలోని మూడు బాలికల ఆశ్రమ పాఠశాలలకు భవనాలు మంజూరయ్యాయి. ఇందులో భాగంగా రావణాపల్లి, రాజేంద్రపాలెం, కొమ్మికల ప్రాంతాల్లోని బాలికల పాఠశాలలకు నిధులు విడుదల చేశారు. ఈ మేరకు రూ.2.75 కోట్లతో ఒక్కో భవనాన్ని నిర్మాణం చేయనున్నారు.దీనికి సంబంధించిన టెండర్ ప్రక్రియను నిర్వహిస్తున్నారు. జీ–ప్లస్ 2 పద్ధతి లో రెండు అంతస్తులను నిర్మించనున్నారు.

కాఫీ ప్రాసెసింగ్ యూనిట్‌ను చింతపల్లిలో ఏర్పాటుచేయాలి




విష్ణుమూర్తి

గూడెంకొత్తవీధి: కాఫీ ప్రాసెసింగ్ యూనిట్‌ను చింతపల్లిలో ఏర్పాటు చేయాలని చింతపల్లి కాఫీ మాక్స్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ అడపా విష్ణుమూర్తి డిమాండ్ చేశారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం డౌనూరులో ఏర్పాటు చేసేందుకు శంకుస్థాపన చేసిందన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం నర్సీపట్నంలో ఏర్పాటు చేసేందుకు యోచిస్తుందన్నారు. కాఫీ పంట గిరిజన ప్రాంతానికి చెందినది కావడంతో దీనిని చింతపల్లిలో ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. జీసీసీ తేమశాతం కోసం మైదాన ప్రాంతంలో ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తున్నారని చెప్పడం అబద్ధమన్నారు. కాఫీని 5.5 శాతం తేమ వచ్చేంత వరకు రైతులు ఇంటి వద్దనే ఎండబెడతారన్నారు. జీసీసీ కూడా నేరుగా రైతుల వద్దకు వచ్చి కొనుగోలు చేస్తుందన్నారు. జీసీసీ కొన్నిచోట్ల ఆర్గానిక్ కాఫీని కిలో రూ.330కి కొనుగోలు చేసి మరి కొన్నిచోట్ల రూ.250కి కొనుగోలు చేస్తుందన్నారు.

అందుబాటులోకి పశువైద్య సేవలు

తెరుచుకున్న పశువైద్యశాల

సాక్షి ఎఫెక్ట్..



తెరిచి ఉన్న పశువైద్య శాల

సీలేరు: సీలేరు మేజర్ పంచాయతీ పశువైద్యశాల ఎట్టకేలకు తెరుచుకుంది. స్థానిక పశువైద్య శాలలో వైద్యులు లేక సేవలు అందడం లేదు. సిబ్బంది కొరతతో పాటు పలు కారణాల వల్ల ఈ వైద్య శాల మూతబడి ఉండడంతో పశు వైద్యం కోసం పాడి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను 'సాక్షి' వెలుగులోకి తీసుకొచ్చింది. ఇందులో భాగంగా 'వెతలు తీరేనా' శీర్షికతో 'సాక్షి'లో సోమవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. సోమవారం ఆస్పత్రిని అటెండర్ గోవింద్ తెరిచారు. పశు వైద్యాధికారి ఎల్.రమేష్ మాట్లాడుతూ పూర్తిస్థాయిలో వైద్యసేవలందించేలా చూస్తామన్నారు. సిబ్బంది ఆస్పత్రిలో అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.

ఆలయ నిర్మాణానికి సహకారం

కొయ్యూరు: కొయ్యూరు సమీపంలో మల్లెపూల చదును ప్రాంతంలో నిర్మించ తలపెట్టిన అయ్యప్ప స్వామి ఆలయానికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని జీసీసీ మాజీ చైర్మన్ ఎం.వి.ఎస్ ప్రసాద్ హామీ ఇచ్చారు. ఆయన సోమవారం స్థానిక భ్రమరాంబిక సమేత మల్లికార్జున స్వామి ఆలయాన్ని సందర్శించారు. ఇక్కడి సమీపంలో ఉన్న మల్లెపూలచదును గ్రామం వద్ద ఆలయ నిర్మాణ స్థలాన్ని పరిశీలించారు. ఆలయ నిర్మాణానికి సుమారు రూ.2.50 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేశామన్నారు.

మద్దిగరువును మండల కేంద్రంగా ప్రకటించాలని వినతి



పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజుకు వినతిపత్రాన్ని అందజేస్తున్న ఎంపీపీ అప్పలరాజు, సర్పంచ్ మాలన్న

జి.మాడుగుల: మద్దిగరువుని మండలంగా ప్రకటించాలని కోరు తూ పాడేరు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజును, జిల్లా ఏఎస్పీ కె.ధీరజ్‌కు సోమవారం మండల సాధన కమిటీ సభ్యులు ఎంపీపీ లొంబోరి అప్పలరాజు, సర్పంచ్‌లు లసంగి మాలన్న, పి.రత్నం వినతిపత్రాన్ని అందజేశారు. వారు మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు జిల్లాలో మారుమూల ప్రాంతమైన మద్దిగరువును మండల కేంద్రంగా ఏర్పాటు చేస్తే అన్ని పంచాయతీలు అభివృద్ధి చెందుతాయని వారు తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చి 78 సంవత్సరాలు గడుస్తున్నా అభివృద్ధికి ఆమడ దూరంలో ఈ ప్రాంతం ఉందని వారు చెప్పారు. 13 పంచాయతీలకు అనువుగా మద్దిగరువు ఉందని దీనిని మండల కేంద్రంగా ఏర్పాటు చేయటంతో అన్ని పంచాయతీలు అభివృద్ధి చెందుతాయన్నారు. మాజీ సర్పంచ్‌లు రాంబాబు, పండన్న, రాము తదితరులు పాల్గొన్నారు.

ఆదికర్మయోగి అభియాన్‌పై శిక్షణ తరగతులు

జి.మాడుగుల: మండలంలో గల ఎంపీటీసీ, సర్పంచ్, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాలయం సిబ్బందికి, కమ్యూనిటీ లీడర్లు, ఎన్‌జీవో విలేజ్ డాక్టర్లు, టీచర్లు, ఎస్‌హెచ్‌జీలకు ఈనెల 8 నుంచి 11వ తేదీ వరకు ఉదయం 9.30 నుంచి సాయంత్రం 5గంటలకు వరకు ఆది కర్మయోగి అభియాన్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఇన్‌చార్జి ఎంపీడీవో పి.వీరభద్రరావు ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని 17 పంచాయతీల్లో 18 గ్రామ సచివాలయాల పరిధిలో 443గ్రామాలున్నాయన్నారు. ఆది కర్మయోగి అభియాన్ వీపీఎల్–శిక్షణకు డీఎంటీ ఇన్‌చార్జీగా ఎంపీడీవో డేవిడ్‌రాజ్ వ్యవహరిస్తారన్నారు. బొయితిలి, జి.మాడుగుల, గెమ్మెలి, కె.కోడాపల్లి, నుర్మతి, పాలమామిడి, సొలభం, వంజరి, వంతాల పంచాయతీల పరిధిలో ట్రైనర్ల ద్వారా ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. వివిధ శాఖల మండలస్థాయి అధికారులు బీఎంటీలుగా వీపీఎల్–శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తారని ఆయన తెలిపారు.